గుండెపోటుతో ఆర్‌టిసి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుండెపోటుతో ఆర్‌టిసి ఉద్యోగి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం వివేకానందనగర్‌లో నివాసం ఉంటున్న డి.కృష్ణప్ప(56) మదనపల్లె ఆర్‌టిసి-1 డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్ (ఎడిసి)గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లేందుకు సిద్ధమై బయలుదేరుతుండగా ఒక్కసారిగా గుండెపోటుతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. బాధితుడిని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య చిట్టెమ్మ, ముగ్గురు కుమార్తెలు అనిత, సుస్మిత, వర్షిత ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్‌టిసి ఉద్యోగులు మృతుడి ఇంటికి చేరుకొని సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఓదార్చి, మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మృతి చెందిన కృష్ణప్ప

నాణ్యమైన విద్యుత్ అందించడమే

'కరెంటోళ్ల జనం బాట' లక్ష్యం : సిఎండి

ప్రజాశక్తి-పీలేరు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడమే 'కరెంటోళ్ళ జన బాట' కార్యక్రమ లక్ష్యమని ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) లోతేటి శివశంకర్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం పీలేరు మండలం, గూడరేవుపల్లి గ్రామం, పుట్టావాండ్లపల్లిలో ఎపిఎస్‌పిడిసిఎల్ పీలేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) వై.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి విద్యుత్ వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎండి విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ కనెక్షన్ సమస్యలు, బిల్లుల వివాదాలు, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ, డిజిటల్ చెల్లింపులు వంటి అంశాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిఎండి లోతేటి శివశంకర్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ కనెక్షన్, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ సమస్యలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, 14 సమస్యలను గుర్తించామని పేర్కొన్నారు. అందులో ఐదు సమస్యలకు యుద్ధ ప్రాతిపదికన పరిష్కార మార్గం చూపినట్లు తెలిపారు. మిగిలిన వాటికి నిర్దేశిత గడువులోగా పరిష్కార మార్గం చూపించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూముల్ని పరిశీలించి, విద్యుత్ వాడకంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలాల వద్ద స్టార్టర్లు, ఎర్తింగ్ భద్రతకు తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రతి మంగళ, శుక్రవారం నిర్దేశిత గ్రామాలు, పట్టణ వార్డుల పరిశీలన, 11 కెవి, ఎల్‌టి, వ్యవసాయ విద్యుత్ లైన్ల పరిశీలన, కిందకు వేలాడే విద్యుత్ తీగలను సరిచేయడం, వాలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి మార్పు చేయించడం, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తును పెంచడం, లేదా ఫినిషింగ్ ఏర్పాటు చేయడం, పాఠశాలలు, అంగన్వాడీ ప్రాంగణాలపై ప్రత్యేక దృష్టి, విద్యుత్ సమస్యల గుర్తింపు, రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం, విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించడం, నిరంతరం విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యుత్ అందించడమే 'కరెంటోళ్ళ జన బాట' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు స్వయంగా తెలుసుకోవడానికి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ సిఎండి (సెల్: 89777 16661) కార్యక్రమం చేపట్టినట్లు కూడా ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిఇఇ అమీర్‌బాష, రూరల్ ఎఇ రామమూర్తి, సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న సిఎండి

కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదే

- మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని, ప్రజాబలం మన వైపే ఉందని, కూటమి నాయకులు పెట్టే ప్రలోభాలకు తలవొంచొద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చిన జగన్‌కు కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మైదుకూరు, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డిలతోపాటు పలువురు వైసిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లాలోని ముఖ్య నేతలు, ప్రజల నుంచి వినతులు స్వయంగా స్వీకరించారు. ప్రతి ఒక్కరితోనూ ఆప్యాయంగా పలకరిస్తూ, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తుక్కిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి అభివృద్ధి నిలిచిపోయిందని తెలిపారు. అరాచకాలు, దందాలు ఎక్కువయ్యాయన్నారు. మూడు సంవత్సరాలు ఓపిక పట్టండి మన ప్రభుత్వం వస్తుందని తెలిపారు. ఇటీవల కడప నూతన మేయర్‌గా ఎన్నికైన పాకాల సురేష్‌ను కండువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని సమిష్టిగా పనిచేయడం వల్లే మేయర్ స్థానాన్ని నిలబెట్టుకున్నామన్నారు. ప్రతి ఎన్నికల్లో సమిష్టిగా పోరాడాలని ఆయన వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బద్వేల్, రాజంపేట ఎమ్మెల్యేలు సుధా, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కమలాపురం, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, బద్వేల్ ఇన్‌ఛార్జి డిసి.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న చేస్తున్న జగన్

నేడు ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జగన్

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పాల్గొనన్నారు. ఇడుపులపాయలోని ప్రార్థన మందిరంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ముఖ్య నేతలు పాల్గొని వచ్చే స్థానిక ఎన్నికల గురించి, జిల్లాలో జరుగుతున్న రాజకీయాలపై చర్చించనున్నారు.

రాజంపేట బంద్ సంపూర్ణం

రాజంపేట : ఎన్‌టిఆర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా ప్రకటించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ సంపూర్ణంగా ముగిసింది. విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, కూరగాయల మార్కెట్, బ్యాంకులు జిల్లా కేంద్రం ఆకాంక్షతో స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పార్టీలకతీతంగా జెఎసి నాయకులు తెల్లవారుజామునుంచే బంద్‌లో పాల్గొని ఆర్‌టిసి బస్సులను అడ్డుకుని నిలిపేశారు. జనసేన పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు జెఎసి నాయకులతో కలిసి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా ఎన్‌టిఆర్ కూడలిలోని జాతీయ రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిలో సైతం వాహనాలు గంట పాటు స్తంభించిపోయాయి. పాత బస్టాండు కూడలిలో 14 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం మహిళా నాయకులు శ్రీలత ఆధ్వర్యంలో మహిళలు దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షా శిబిరంలో కొండవీటి జ్యోతిర్మయి బృందం వారు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం జెఎసి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాత బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో యల్లటూరు మాట్లాడుతూ అన్నమయ్య పుట్టి పెరిగిన రాజంపేట అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న ప్రజల ఆకాంక్ష ఎంత బలమైనదో ప్రజలు స్వచ్ఛందంగా పాటించిన ఈ బందే నిదర్శనమని పేన్నొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజంపేట వాసుల మనోవేదనను గుర్తించి అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పూల భాస్కర్, తరిగోపుల లక్ష్మీనారాయణ, అబ్బూరి ప్రభాకర్ నాయుడు, డాక్టర్ నవీన్ చంద్ర, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు వచ్చి, పట్టణంలోని అమ్మవారి శాల నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ అన్ని విధాలా వసతులు కలిగిన రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. **రైల్వేకోడూరు :** అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలంటూ ఎడ్యుకేషనల్ జెఎసి, జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేకోడూరులో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు, వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాలు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. అనంతరం పోలీసుల చొరవతో వాహనాల రాకపోగలను పునరుద్ధరించారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎంపిపి బాబుల్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సాయి కిషోర్ రెడ్డి బంద్‌కు మద్దతు తెలిపి దీక్ష శిబిరం వద్ద సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ముత్యాల పెంచలయ్య, ఎస్‌ఎన్.శ్రీనివాసులు, ఎంవి.కుమార్, కె.చంగల్ రాజు, డాక్టర్ ప్రదీప్, మదన్, నరసింహారెడ్డి, సుకుమార్, గోపీనాథ్, ఎం.తులసి, ఎస్.చెంగల్ రాజు, డాక్టర్ సయ్యద్ అహ్మద్, పి.నవీన్, ఎన్.హేమరాజ్, సిహెచ్.రమేష్, సభాపతి, సుమన్, అమర్, సుబ్బారావు పాల్గొన్నారు. **నందలూరు:** అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేట చేయాలని జెఎసి నాయకులు చేపట్టిన బంద్ విజయవంతమైంది. ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, దుకాణాలు, బ్యాంకులను నాయకులు మూయించి వేశారు. బస్టాండు కూడలిలో హైవే రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. జ్ఞాన దీప్తి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు, ఆల్విన్ మౌంట్ కార్మెల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జెఎసి నాయకులకు మద్దతుగా రాజంపేట ముద్దు రాయచోటి వద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎద్దుల విజయసాగర్, ఇబ్బు బాయ్, ఆనాల మధు యాదవ్, బద్రి రెడ్డి, జంగం శెట్టి సుబ్బయ్య, రేవూరి వేణుగోపాల్, మోడపోతుల రాము, కొట్టే శ్రీహరి, గురువిగారి వాసు, సయ్యద్ అమీర్, మేస్త్రి వెంకటసుబ్బయ్య, మస్తాన్ రాయల్, సుబ్బ నరసయ్య, తాటి సుబ్బరాయుడు, జ్యోతి శివ, కొండిశెట్టి సుదర్శన్, జయ చంద్రారెడ్డి, చలపతి, సురేష్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ప్రధాన రహదారిపై బంద్ నిర్వహిస్తున్న నాయకులు

న్యాయవ్యవస్థను కాపాడేది న్యాయవాదులే

- జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కృష్ణన్ కుట్టి

ప్రజాశక్తి-రాయచోటి

కార్యనిర్వాహక వ్యవస్థలను సరైన మార్గంలో నడిపించి ప్రజాస్వామ్య విలువలను ప్రజల హక్కులనుకాపాడు తున్న న్యాయవ్యవస్థను కాపాడగలిగేది న్యాయవాదులేనని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్ అధ్యక్షతన కోర్టు ఆవరణంలో ఐపిసిని బిఎన్‌ఎస్‌తో పోల్చుతూ ఐఎఎల్ తీసుకొచ్చిన పుస్తకావిష్కరణ, న్యాయవాదుల డైరీ ఆవిష్కరణ సమావేశం లక్ష్మీపురంలోని కోర్టు ఆవరణంలో నిర్వహించారు. జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధన ముఖ్య అతిథులుగా పాల్గొని న్యాయవాదులు అందరికీ ఐఎఎల్ డైరీలను ఐపిసిని బిఎన్‌ఎస్‌తో పోల్చిన పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి జడ్జి కృష్ణన్ కుట్టి మాట్లాడుతూ కోర్టుకు న్యాయవాదులు తల్లి లాంటివారని న్యాయవాదుల నుండే న్యాయమూర్తులు చాలా చట్టపరమైన విషయాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. జూనియర్ న్యాయవాదులు కష్టపడిచట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే స్వతంత్రంగా ఎదగగలిగే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధన మాట్లాడుతూ ఐపిసి, బిఎన్‌ఎస్ చట్టాలను పోల్చుతూ ఐఎఎల్ తీసుకొచ్చిన న్యూ క్రిమినల్ లాస్ పుస్తకం న్యాయవాదులతో పాటు న్యాయమూర్తులకు కూడా చాలా ఉపయోగకరంగా ఉందని ఈ పుస్తకాన్ని తీసుకొచ్చిన భారత న్యాయవాదుల సంఘానికి అభినందనలు తెలియజేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తులకు న్యాయవాదులు విధేయులుగా ఉంటూ చెప్పాలనుకున్న విషయాలను సమగ్రంగా న్యాయమూర్తులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి బాషా, ఉపాధ్యక్షులు ధనుంజయ్ కుమార్, ట్రెజరర్ ఆదిరెడ్డి నాయక్, లైబ్రరీ సెక్రటరీ టి.వి.రమణ, ఐఎఎల్ జాయింట్ సెక్రటరీ మిఠాయిగిరి ఖాదర్బాషా, రాయచోటి బార్ అసోసియేషన్ 60 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోని కూటమి పాలన అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేక పోతోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శ గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం టిడిపి కార్యాల యంలో ఆయన జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచేందుకు అనేక రాయితీలు చంద్రబాబు నాయుడు ఇస్తున్నారని, ఉద్యానవన పంటలు కూడా కళకళలాడేలా ముఖ్యమంత్రి చేస్తున్నారని చెప్పారు. ఈరోజు రైతులు చంద్రబాబు నాయుడు పాలనలో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఇప్పటికే వారి ఖాతాల్లో రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14 వేలు జమ అయ్యాయని తెలిపారు గతంలో వైసిపి ప్రభుత్వంలో హత్య రాజకీయాలు కక్ష సాధింపులతో రైతులు నష్టపోయారు అన్నారు. రైతుల ఆత్మహత్యల్లో చూస్తే వైసిపి ప్రభుత్వంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని ఇప్పుడు రైతులు హాయిగా నిద్రపోతున్నారని చెప్పారు. దేశంలో ఉన్న రాష్ట్రాలలో ఆంధ్ర రాష్ట్ర మొదటి స్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. వైసిపి నాయకులు అభివృద్ధికి సహకరించాలే తప్ప రోడ్లెక్కి నానా చేష్టలు చేయడం సరైంది కాదని తెలిపారు. సమావేశంలో సంబేపల్లి మండల అధ్యక్షుడు శివారెడ్డి, జయరాం రెడ్డి, సాంబశివరెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, రోఫా కాసిం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు పోర్డు సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ తెలిపారు. మంగళవారం సత్యసాయి జిల్లా కలెక్టివ్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి తంబళ్లపల్లి మండలం, గుండ్లపల్లి రైతులకి ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం కోసం రామగిరి మండలం చెన్నే కొత్తపల్లికి ప్రత్యేకంగా బస్సులో తీసుకెళ్లి అక్కడి రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేసి మాట్లాడించడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అవలంభిస్తున్న పద్ధతులు, వారు పండించిన పంటలను క్షేత్ర స్థాయిలో రైతులు పరిశీలించి అవగాహన పెంచుకున్నారని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సంపాదించడం తెలుసుకొన్నారన్నారు. అనంతరం గుండ్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని చెన్నే కొత్తపల్లి తరహాలో పంటలసాగును ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించడానికి రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి వాడడం వల్ల వినియోగదారులకు అనారోగ్య సమస్యలు అధికమై ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కోసం తాము మహాయజ్ఞం తలపెట్టమని, ఈ దిశగా రైతాంగాన్ని ఆలోచింపచేస్తూ అనుసరించే విధంగా వారిని ప్రేరేపిస్తున్నామన్నారు. ఆరోగ్యం కావాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని సూచించారు.

ప్రయివేట్ పాఠశాలల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో కొత్తగా ప్రయివేటు పాఠశాలలు ప్రారంభించేందుకు ఈ నెల 31 డిసెంబర్ లోపు ఆన్‌లైన్లఓ దరఖాస్తు చేసుకోవాలని పాఠశాలల విద్యా డైరెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. https://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని నిబంధనలను అనుసరించి అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. పాఠశాలలకు అనుమతి ఇచ్చిన తరువాత ప్రారంభానికి కావలసిన సదుపాయాలు ఏర్పాటులు చేసుకునేందుకు సమయం అవసరం కానున్నందున ఈ నెల 31 లోపు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. గడువు తేదీ దాటిన ప్రతిపాదనలను పరిగణలోనికి తీసుకొనబడవుని తెలిపారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-రాజంపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో సత్తుపల్లికు చెందిన జడ జయమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జయమ్మ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 24 గంటలు గడవకముందే ప్రత్యేక చొరవ తీసుకొని వాటికి వారికి ఆర్థిక సహాయం అందజేసిన నియోజకవర్గం ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, జడ శివకుమార్ పాల్గొన్నారు.



బాధితులకు చెక్కు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ నాయక్

'మిట్స్'తో బెల్లు ఎఐ ఎంఒయు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, మదనపల్లెకు చెందిన బెల్లు ఎఐ కంపెనీతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. ఈ అవగాహన ఒప్పందంపై మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థులైన బెల్లు ఎఐ కంపెనీ సిఇఒ బి.సంతోష్ నాయక్, బెల్లు ఎఐ సభ్యుడు కె.సాయి గణేష్, విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థి బి.సంతోష్ నాయక్ మాట్లాడుతూ మానవసమాన లక్షణాలతో కూడిన హ్యూమనైజ్డ్ రోబోట్ అభివృద్ధి లక్ష్యంగా ఈ ఒప్పందం ద్వారా ఇరు సంస్థలు సంయుక్తంగా పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టు కోసం దేశవ్యాప్తంగా డేటా సేకరణకు బెల్లు ఎఐ సంస్థకు సుమారు రూ.80 కోట్ల నిధులు మంజూరవుతాని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపే విద్యార్థులకు చెల్లింపు గల ఇంటర్న్‌షిప్‌లు, వారు చేసిన పనికి సర్టిఫికెట్లు అందించడంతో పాటు, పరిశోధన పట్ల ఆసక్తి, కొత్త విషయాలను అన్వేషించే తపన ఉన్న విద్యార్థులను వాస్తవ పరిశోధనా ప్రాజెక్టుల్లో భాగస్వాములుగా తీసుకొని ప్రత్యక్షంగా పనిచేసే అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మిట్స్ యూనివర్శిటీ విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అకడమిక్ ప్రాజెక్ట్‌లు, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫర్‌లలో విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాల్లో ప్రయోగాత్మక అనుభవం పొందడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు పరిశ్రమలు, పరిశోధన అవసరాలకు మరింత సిద్ధమవుతారని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కళాశాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.నిత్య, కోఆర్డినేటర్లు టి.తంగరసన్, జి.ముత్తుగురునాథన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్ బ్రాంచ్ ఎస్‌బిఐ మేనేజర్ మంగళగౌరి తెలిపారు. మంగళవారం బ్రాంచ్‌లో కస్టమర్స్ రిలేషన్షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మంగళగౌరి మాట్లాడుతూ ఖాతాదారులకు సకాలంలో, అంతరాయం లేకుండా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వినియోగదారులకు ఏవైన సందేహాలు, సమస్యలు ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. సైబర్ క్రైమ్, గోల్డ్ లోన్స్, బ్యాంకు సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ, విశ్రాంత డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ధనలక్ష్మి, బ్యాంకు సిబ్బంది, బ్యాంక్ వినియోగదారులు పాల్గొన్నారు.

మదనపల్లె అభివృద్ధి ఎమ్మెల్యేతోనే సాధ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె అభివృద్ధి ఎమ్మెల్యే షాజహాన్ బాషాతోనే సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలు స్వామి, నవీన్ చౌదరి, మోడెం సిద్ధప్ప, జంగాల వెంకటరమణ, బోనాసి జాన్ బాబు, మహాలక్ష్మి, విజయమ్మ, నాగమణి మాట్లాడుతూ షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగా 18 నెలల కాలంలోనే నియోజకవర్గాన్ని గణనీయంగా అభివృద్ధి చేశారన్నారు. సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి బోర్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. రూ.కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అధిక మొత్తంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిధులను తెప్పించి ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా వైసిపి నాయకులు కూటమి పాలనలో అభివృద్ధి జరగలేదనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసిపి ఎటువంటి అభివృద్ధి చేయకపోగా ప్రస్తుతం అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీ నాయకులకు కబ్జాలు, అవినీతి, దౌర్జన్యాలపై ఉండే శ్రద్ధ అభివృద్ధిపై లేదని చురకలంటించారు. మదనపల్లె అభివృద్ధిపై మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు. వైసిపి నాయకులు అనవసరపు విమర్శలుమాని అభివృద్ధికి సహకరించాలన్నారు. తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు: విద్యార్థులు తాము ఎంచుకునే వృత్తి పట్ల విద్యార్థి దశ నుంచే స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒలు సూచించారు. కెవి పల్లి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి ఎంపికైన పాఠశాల స్థాయి కెరీర్ ఎక్స్‌పో విజేతలతో మండల స్థాయి కెరీర్ ఎక్స్‌పోను సోమవారం కెవి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఇఒలు పి.రెడ్డి బాష, డి.సుబ్రమణ్యంరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఆసక్తికి, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, రమణపాల్గొన్నారు.

చైతన్య సంస్థలో అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో వైసిపి ఇంటలెక్చువల్ ఫోరం డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ ఎల్.రఘునాథ్‌రెడ్డి సోదరుడు ఎల్.వీరారెడ్డి భార్య కళావతమ్మ 9వ వర్ధంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రెటరీ ఎ.కవితారాణి మాట్లాడుతూ ఎల్.రఘునాథ్‌రెడ్డి వారి కుటుంబంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో జరుపుకుంటూ పిల్లలకు, వృద్ధులకు అవసరమయ్యే సహాయం చేస్తుంటారన్నారు. రఘునాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవరెడ్డి మాట్లాడుతూ చైతన్య సంస్థలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్, ఎల్.రఘునాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంస్థ జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫోరం స్టేట్స్ జనరల్ సెక్రెటరీ వివిఎస్ రెడ్డి, వైసిపి కార్యకర్తలు, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు

సామాజిక తనిఖీలో వివరాలు సేకరిస్తున్న పిడి వెంకటరత్నం

సామాజిక తనిఖీలో రూ.19,179 రికవరీ

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ద్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో రూ.19179 రికవరీ చేయగా రూ.6,500 అపరాధ రుసుం వేసినట్లు తెలిపారు. కొంతమంది ఈ ప్రజా వేదిక కార్యక్రమం చూసినవాళ్లు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని విమర్శించారు. కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ శ్రీరాములు, కలికిరి ఎపిడి శ్రీనివాసులు, క్లస్టర్ ఎపిడి మధుబాబు, ఎస్‌టిఎం కోనయ్య, ఎస్ఆర్‌పి సూర్యచంద్ర, ఎపిఒ సుజాత, డిఆర్‌పిలు, జెఇలు, టిఎలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో సమయం మార్పు : ఎఇ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో విద్యుత్ 33కెవి లైన్ నిర్మాణ పనులను చేపడుతున్నందున ఈనెల 23న నుంచి 28 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నందున విద్యుత్ సరఫరా సమయాన్ని మార్పు చేసినట్లు విద్యుత్‌శాఖ ఎఇ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లి ఫీడర్‌లో ఉన్న రెడ్డివారిపల్లి విద్యుత్ ఉపకేంద్రం నుంచి నిమ్మనపల్లి విద్యుత్ ఉపకేంద్రం వరకు పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్తగా 33కెవి విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమ్మనపల్లి, వెంగంవారిపల్లి విద్యుత్ ఉప కేంద్రాలకు వాల్మీకిపురం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరాను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తిమ్మాపురం, తవళం, బహుదా, రెడ్డివారిపల్లి, చల్లా వారిపల్లి, అగ్రహారం ఫీడర్ ల పరిధిలోని వ్యవసాయ బోర్లకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో ఈనెల 28వ తేదీ వరకు అంతరాయం ఏర్పడు తున్నాయన్నారు. ఈ మార్గాలలో వ్యవసాయ సాగు కోసం 9గంటల విద్యుత్ సరఫరాను రెండు విడతలలో చేస్తున్నట్లు తెలిపారు. మొదట విడత తెల్లవారు జామున 2 గంటల నుంచి 7గంటల వరకు, రెండవ విడత రాత్రి 8గంటల నుంచి 12గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతులు మారిన విద్యుత్ సరఫరా సమయాలను గమనించి అందుకు అనుగుణంగా వ్యవసాయ పనులను చేసుకోవాలన్నారు.అధికారులకు సహకరించాలని ఎఇ కోరారు.

మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మైనర్ల చేతులకి వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురైతే కఠిన చర్యలు తప్పవని సిఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్ రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వాహనాలు మైనర్ చేతికిస్తే ప్రమాదానికి గురైతే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.వాహన చోదకులు ప్రయాణాల్లో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని చెప్పారు. లేకుంటే భారీ జరిమానాలతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మండల టిడిపినాయకుడు వీరబల్లి నాగబసిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసిన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 18 నెలల కాలంలోనే రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు , ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కలుస్తుదని ఆయన పేర్కొన్నారు. తాను ఇటీవల విజయవాడలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరానని తెలిపారు. మండల పార్టీ నాయకులను కార్యకర్తలను కలుసుకోవాలని ఉద్దేశంతో ఈనెల 28న పెట్రోల్ బంక్ సమీపంలో మండిపల్లి నాగిరెడ్డి ప్రాంగణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రిసోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, యువ నాయకులు మౌర్యరెడ్డి, నిశ్చల్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని టిడిపి కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని 40వ జాతీయ రహదారిలో తరచూగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్‌రోడ్డు మొదలు రాయచోటి రింగ్ రోడ్ వరకు మండల పరిధి జాతీయ రహదారి పైనే ఉందన్నారు. ఘాట్ రోడ్డు మలుపుల వద్ద జాతీయ రహదారి వెంబడి తరచూ ప్రమాదం జరిగే ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వాహన చోదకులు వెళ్లే సమయంలో ఇంటి వద్ద మన కుటుంబ సభ్యులు గుర్తుచేసుకొని అతివేగం ఆ జాగ్రత్తగా లేకుండా వాహనాలను వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పఠాన్ ఖాదర్‌ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్ : రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టిడిపి సీనియర్ నాయకులు పఠాన్‌ఖాదర్‌ఖాన్‌కు కూటమి నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. విజయభారతి విద్యాసంస్థల అధినేత సేతు నల్లు స్వామి, సమక్షంలో చల్లపల్లి నరసింహారెడ్డి స్వగ్రామంలో మంగళవారం నిర్వహించారు. టిడిపికి ఖాదర్‌ఖాన్ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాజం పేట పార్లమెంట్ పరిధిలో అత్యంత కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభిస్తుందనడానికి నిదర్శనమని చల్లపల్లి నరసింహారెడ్డి అన్నారు. డాక్టర్ ఉత్తుమల్లూ ఖాన్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు తప్పకుండా గుర్తింపు వస్తుందనడానికి పఠాన్ ఖాదర్ ఖాన్ ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో పాటు సామాజిక సేవలో కూడా ఆయన చురుకుగా పాల్గొంటున్నారని, భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో, ఎల్లంపల్లి ప్రశాంత్, కృష్ణమూర్తి, రవికుమార్, మోహన్, రమేష్‌వర్మ పాల్గొన్నారు.

పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని బాలికల జడ్‌పి హైస్కూల్‌లో వినియోగదారుల హక్కులపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.జయమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించగలరని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎఇఒ నాగార్జున మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన వస్తువులు, సేవలు పొందే హక్కు కలిగి ఉన్నారని, వినియోగదారుల చట్టాలపై అవగాహన ఉంటే అన్యాయాలను ధైర్యంగా ప్రశ్నించవచ్చని ఆయన పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం అవసరమని సూచించారు. అన్నమయ్య జిల్లా కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు జాముల్లా మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వినియోగదారులుగా మారుతున్న ఈ రోజుల్లో చైతన్యవంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. లీగల్ అడ్వైజర్ రవిశంకర్ వినియోగదారుల చట్టాల ప్రాముఖ్యతను వివరిస్తూ, నకిలీ ఉత్పత్తులు, ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఎస్ఐ నరసింహులు చట్టపరమైన భద్రత, వినియోగదారుల రక్షణ అంశాలపై సందేశాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థినిలకు సూచనలు ఇస్తున్న అనురాధ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పదవ తరగతి ఫలితల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అనురాధ తెలిపారు. మంగళవారం ఎంఇఒ పద్మావతితో కలిసి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని వారు సందర్శించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి పాఠశాలలో చేపడుతున్న విద్యా ప్రణాళికలను ప్రిన్సిపల్ ముని వెంకటమ్మ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల కార్యాచరణను రూపొందించి ఉపాధ్యాయులకు తగు విధంగా సూచనలు చేసిందన్నారు. విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను తీసుకుని పాఠ్యాంశాలు అర్ధమయ్యేలా బోధించాలన్నారు. క్రమంగా పరీక్షలను నిర్వహిస్తే విద్యార్థులలో పరీక్షలపై భయాన్ని పోగొట్టాలన్నారు. విద్యార్థులకు పరీక్షల కోసం ఏ విధంగా సన్నద్ధమవ్వాలో పలు సూచనలు చేశారు. పాఠశాలలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనబాట పట్టిన కరెంటోళ్లు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని డి.రాచపల్లి పంచాయతీలో విద్యుత్ ఎఇ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కరెంటోళ్లు మంగళవారం జనబాట పట్టారు. విద్యుత్ సిబ్బందితో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పెద్దూరు కస్పా, పెద్దమాదిగపల్లి, రాచపల్లి, కళ్లేవాండ్లపల్లి, వంగి మళ్ళ, నాగిరెడ్డిగారిపల్లి, దుగనపల్లి, టెంకాయ చెట్లపల్లి, విద్యుత్ పరంగా, ప్రమాదాలు లేకుండా చేసేందుకు 11 కెవి, క్రింద ఉన్న కంపచెట్లు తొలగించారు. కరెంటోళ్ళు జనబాట కార్యక్రమానికి సంబంధించిన ప్రచార గోడపత్రాలను అంటించారు. 11కెవి, ఎల్‌టి లైన్ల వెంట విద్యుత్ సిబ్బంది వెళ్లి వీధుల్లో, వ్యవసాయ పొలాల్లో, ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగి పోవడం, తీగలు వేలాడడం, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు పగిలిపోవడం తీగల వేలాడు తుండడం, విద్యుత్ స్తంభాల మార్పు, ఇటువంటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల సెంటర్లు, వద్ద ప్రత్యేకంగా పరిశీలించారు. ఎఇ విద్యుత్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం కలిగించడం, స్మార్ట్ మీటర్ల విద్యుత్‌పైన ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కేశవ, లైన్ ఇన్‌స్పెక్టర్ రెడ్డయ్య, జూనియర్ లైన్‌మెన్ పాల్గొన్నారు. **కలికిరి:** ఎపిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారానికి కరెంటోల్ల జనబాట కార్యక్రమాన్ని మర్రికుంటపల్లి గ్రామంలో ఎడిఇశివయ్య ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా గ్రామంలో పర్యటించి విద్యుత్ బిల్లుల సమస్యలు, మీటర్ సమస్యలు, సరఫరా అంతరాయాలు, కొత్త కనెక్షన్లు, పేరు మార్పు, లోడ్ మార్పు వంటి అంశాలపై వినియోగదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి త్వరలో వారి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు నిర్ణీత సమయాల్లో జనబాట కు హాజరై తమ సమస్యలను తెలియజేయాలని, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత్ సేవల్లో పారదర్శకత, వినియోగదారుల సంతృప్తే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌పిడిసిఎల్, డిఇఇ ఎం.శివయ్య, ఎఇ ముజిబుర్, రెహమాన్ ప్రజలకు వెల్లడించారు.

వీరబల్లి :కంప చెట్లు తొలగింపజేస్తున్న ఎఇ కిషోర్ కుమార్

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ఎంపీ మిథున్‌రెడ్డితోమాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కలకడ

మండల అభివృద్ధికి సహకరించాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని మండల వైసిపి నాయకులు కోరారు. మంగళవారం కె.విపల్లి మండలంలో జరిగే ఒక కార్యక్రమానికి హాజరైన ఎంపీని వైసిపి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా పూలమాల దుశ్శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. అనంతరం వారు ఎంపీని మా మండలం వెనుకబడి ఉందని ఎంపీ నిధులతో తాగునీరు, డ్రెయినేజీ సమస్య, రోడ్లు వేసి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో సమస్యలకు పరిష్కారం చూపుతానని చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, నాయకులు మోహన్ రాజానాయుడు, కుమార్ రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, షావత్ అలీ, ప్రకాష్ రెడ్డి (బాబు రెడ్డి) వైసిపి కార్యకర్తలుపాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని సోమవరం పంచాయతీలో ఉన్న సచివాలయాన్ని ఎంపిడిఒ గౌస్‌బాషా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్, హాజరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. విధుల నిమిత్తం బయటకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. క్యాజువల్ లీవ్, స్పందన లీవ్ రిజిస్టర్‌లను పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలకు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్లు కాల్వలను రోడ్లను శుభ్రం చేయాలని సూచించారు. ప్రజలు తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్తను వర్మీ కంపోస్టుకు, పొడి చెత్తను డంపింగ్ యార్డ్‌కు పంపించాలన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

దూడలకు నట్టల నివారణ మందులు తాపిస్తున్న వైద్య సిబ్బంది

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి - నందలూరు

పశుసంవర్ధక శాఖ చేపడుతున్న రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండలం లోని పాటూరు పంచాయతీ ఎర్రిపాపాయపల్లి గ్రామంలో ఉచితంగా 25 పశువుల గర్భకోశవ్యాధులకు చికిత్సలు, 35 దూడలకు నట్టల నివారణ మందులు త్రాపించటం జరిగిందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ తిమ్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో పాడి రైతులకు ఉచితంగా మిశ్రమ ఖనిజ లవణాల ప్యాకెట్లు, దూడలకు మిశ్రమలోన ఖనిజ లవణాల రాళ్లను అందజేశామన్నారు. మందులు కూడా ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట ఉప సంచాలకులు డాక్టర్ వై విజయభాస్కర్‌రావు, రాజంపేట సహాయ సంచాల కులు డాక్టర్ కె.ప్రతాప్, పాటూరు గ్రామ నాయకులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, పాటూరు డాక్టర్ ఈశ్వర్‌ప్రసాద్, నందలూరు డాక్టర్ వై.మాధవిలత, విబిఎల్ రాజు, జెవిఒ గంగులయ్య, సుగుణ, విఎ సుదర్శన్ రెడ్డి, ఎహెచ్ఎ సుస్మిత, శిరీష, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రైతుల ప్రగతికి చేయూత డిసిసి బ్యాంక్

ప్రజాశక్తి-నందలూరు

రైతుల ప్రగతికి చేయూతనందించడమే డిసిసి బ్యాంక్ ధ్యేయమని ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం పాటూరు గ్రామంలో రాయలసీమ జానపద కళాకారుల బృందం ఆధ్వర్యంలో కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పిఎంజెడివై సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారులకు ప్రయోజనాలు జీవిత బీమా, రూపే కార్డు ప్రయోజనాలు, సామాజిక భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ లావాదేవీలు, ఇతర పథకాలపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి, ప్రశాంత్, వీరేంద్ర రైతులు పాల్గొన్నారు.

కళాజాత ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మాట్లాడుతున్న మంజుల

కెవికెలో జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజల ఆధ్వర్యంలో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జన్మదిన సందర్భంగా భారతదేశం అంతట జాతీయ రైతు దినోత్సవం జరుపుతారని తెలిపారు. శాంతాకుమారి మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రభుత్వం అందిస్తున్నటువంటి పథకాలు, రైతులు మార్కెట్ డిమాండ్ ఆధారంగా వివిధ పంటల సాగు చేసి ఆదాయం పొందాలని తెలిపారు. డాక్టర్ కె.మాధురి జి రాంజీ జి పథకం గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సోమశేఖర్‌బాబు, పీరు సాహెబ్, కెవికె సిబ్బంది రైతులు, అగ్రి పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారని మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలన్నారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన చిహ్నాత

ప్రజాశక్తి -చిట్వేలి

మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎబిఎన్ ప్రసాద్ ఆయన పెద్ద కుమారుడు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలస్థాయిలో దేవమాచుపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థిని జడపోలు చిహ్నాత ప్రథమ బహుమతి సాధించింది. ద్వితీయ బహుమతి జి.వెంకట జ్యోత్స్న, తృతీయ బహుమతి సిరి చందన దక్కించుకున్నారు. ప్రాథమిక పాఠశాల దశలోనే గణితంలో అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన విద్యార్థులకు జడ్‌పి హైస్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రావణ కుమారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సిసి శిక్షణ ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, విశ్వనాథనాయుడు, శ్రీనివాసులు, రఫీ, గీతారాణి పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-వీరబల్లి

రైతుల సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎఒ స్వాతి అన్నారు. మంగళవారం పెద్దివీడు పంచాయతీ రెడ్డివారిపల్లె దగ్గర వేరుశనగ పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డ్రంసీడర్ విధానంలో సాగు చేస్తున్న పంటను పరిశీలించారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని రైతులకు సూచించారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులను వినియోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ, రైతులు పాల్గొన్నారు.

భవాని ప్రసాద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

స్థానిక జ్ఞానోదయ స్కూల్ డైరెక్టర్, మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ జోలెపాలెం భవానిప్రసాద్‌కు ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రముఖ సామాజిక సేవకుడు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందిస్తున్నట్లు యూనివర్సిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా భవాని ప్రసాద్ మాట్లాడుతూ తనకు లభించిన గౌరవం మరింత బాధ్యతను కల్పించిందని, భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులు, శ్రేయోభిలాషులు భవాని ప్రసాద్‌ను ఘనంగా అభినందించారు.

శ్రీసాయి కళా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-సుండుపల్లి

శ్రీసాయి కళా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని వశిష్ఠ, చైతన్య పాఠశాలలు కరస్పాండెంట్ డాక్టర్ కొండూరు రెడ్డయ్యరాజు పేర్కొన్నారు. మంగళవారం శ్రీసాయి కళా ఫౌండేషన్ చైర్మన్ మధుసూదన్ ఆయన సతీమణి సరితల కుమార్తె శ్రీసాయికళ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించి చెప్పారు. సాయికళ వైదేహి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతూ గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందిందని చెప్పారు. ఆమె జ్ఞాపకార్థం తిరుపతిలో సాయి కళా ఫౌండేషన్ స్థాపించి ఎన్నో మెడికల్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గొప్ప విద్యావేత్తగా,సంఘ సేవకులుగా అనేక అవార్డులను అందుకున్నారని పేర్కొన్నారు. ఫౌండేషన్ సేవలు మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండూరు రెడ్డెయ్యరాజు

క్రైం కార్నర్

ముగ్గురు కోడి పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రామాపురం

ముగ్గురు కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2300 మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని కుమారపల్లె పంచాయతీ మన్నేరు వాండ్లపల్లికు తూర్పున ఉన్న మామిడి తోటలో మంగళవారం కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో రెండు కోడిపుంజులతో సహా ముగ్గురు పందెం రాయుళ్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.